# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 16, ఏప్రిల్, 2015

మెదక్ జిల్లా సదాశివపేట మండలం అంకంపల్లి గ్రామంలో ప్రస్తుతం ఉన్న ఎంఆర్ఎఫ్ ఫ్యాక్టరీని విస్తరించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. ఫ్యాక్టరీ విస్తరణ విషయంలో ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హామి ఇచ్చారు.

ఎంఆర్ఎఫ్ సి.ఎం.డి. కెఎం.మమెన్, సీనియర్ జనరల్ మేనేజర్ ఐజాక్ తంబురాజ్ క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రిని కలిశారు. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీ 1990 నుండి నడుస్తున్నదని, రూ. 4,300 కోట్ల వార్షిక టర్నోవర్‌తో 6,500 మందికి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దీనికి అనుబంధంగా మరో రూ. 980 కోట్ల పెట్టుబడితో ఫ్యాక్టరీని విస్తరిస్తామని, దీనివల్ల అదనంగా 905 మందికి ఉద్యోగ అవకాశం లభిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కోతను లేకుండా చేసినందుకు ముఖ్యమంత్రిని అభినందించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమలకు ఏలాంటి కోత లేకుండా విద్యుత్‌ను, అవసరానికి తగ్గట్టు నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. విద్యుత్ కొరత లేకుండా తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలనిచ్చాయని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఉండవని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలకు కావలసినంత నీరు కూడా అందుతుందని వెల్లడించారు. పరిశ్రమల స్థాపన, నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని హామి ఇచ్చారు. దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానం తెలంగాణలో తీసుకువస్తున్నామని, త్వరలోనే పారిశ్రామిక వేత్తలతో సమావేశమై విధాన ప్రకటన చేస్తామని సిఎం చెప్పారు. సింగిల్ విండో విధానానికి సంబంధించి ఇప్పటికే అసెంబ్లీలో చట్టం

చేసిన విషయాన్ని కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వారి దృష్టికి తెచ్చారు. పరిశ్రమల స్థాపనను తెలంగాణ రాష్ట్రం ఒక హక్కుగా గుర్తిస్తున్నదని వెల్లడించారు.

సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం